గందరగోళంగా రీసర్వే...!




- కొలతల్లో తేడా.. ఆందోళనలో రైతులు
- సర్వే చేసి రాళ్లు పాతకుండానే వదిలేస్తున్న వైనం
- సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : వైఎస్సార్ జగనన్న శాశ్వత హక్కు.. భూరక్ష పథకం కింద చేపట్టిన భూముల రీసర్వే గందరగోళంగా మారింది. రైతులకు ఏ మాత్రం భరోసా దక్కడం లేదు. 50, 60 ఏళ్లుగా అనుభవంలో ఉన్న భూముల విస్తీర్ణం తగ్గిందని సిబ్బంది చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పాస్ పుస్తకాలు డాక్యుమెంట్లలో ఉన్న భూమికి సర్వేల్లో చెప్పేదానికి కొన్ని చోట్ల సంబంధం ఉండటం లేదు. కొలతల్లో తేడాలు రావడంతో రైతుల మధ్య మనస్పర్థలు వస్తున్నాయి. రైతుల ప్రశ్నలకు రెవెన్యూ సిబ్బంది సమాధానం చెప్పలేకపోతున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారం గురించి ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రీసర్వే పూర్తయి నెలలు గడుస్తున్నా ఆన్‌లైన్, అడంగల్‌లో పాత సర్వే నెంబర్లు పాత విస్తీర్ణాలే కనిపిస్తున్నాయి. రైతులకు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు అందలేదు. రీసర్వే పూర్తయినా చాలా చోట్ల హద్దు రాళ్లు పాతడం లేదు. రైతులే పాతుకోవాలని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వే సరిహద్దుల చట్టం 1923 కింద సెక్షన్ 9(1), 9(2), నోటీసులు ఇవ్వకుండానే అధికారులు సర్వే పూర్తి చేసినట్లు రికార్డులు తయారు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రవి అనే వ్యక్తికి చెందిన పాత పట్టాదారు పాసు పుస్తకం



పాసుబుక్కుపైనా ప్రచారమా..?



ఆధునిక సాంకేతికతతో చేస్తున్న రీసర్వే కూడా తప్పుల తడకగా ఉందని రైతులు వాపోతున్నారు. బ్రిటీష్ వలస పాలనలో 1924లో భూములు సర్వే చేశారు. ఆ తర్వాత 1961లో రీసెటిల్మెంట్ ఆపరేషన్లు చేపట్టారు. అప్పటి భూమి రికార్డులే ఇంకా పదిలంగా ఉన్నాయి. భూ రికార్డులు పాస్ పుస్తకాల్లో కూడా ముఖ్యమంత్రి ఫొటోలు పేరు ఉండటం పట్ల పలువురు రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. రైతు సొంత భూమికి సీఎం జగన్ భూ హక్కు పత్రాన్ని ఇస్తున్నట్లు పాస్ పుస్తకాన్ని రూపొందించారు. వ్యక్తిగత ఆస్తులు వివరాలను పొందుపరిచే పట్టాదారు పుస్తకాల్లో ఇలాంటి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది.

టీడీపీ ప్రభుత్వ హయాంలో భూధార్

ఆధార్ నెంబరును ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో ప్రతి భూమికి 12 అంకెల విశిష్ట సంఖ్య ఉండాలనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వం 2019లో భూధార్ ప్రాజెక్టును ప్రారంభించింది. సర్వే నెంబర్లు వారిగా ప్రతి భూమికి భూధార్ నెంబరు ఇచ్చి దానిని ఆకాంక్ష రేఖాంశాలతో జత చేయాలని నిర్ణయించింది. దీని వల్ల భూముల వివాదాలు నిరోధించవచ్చని, ప్రతి ల్యాండ్ పార్సల్‌కు జీపీఎస్ అనుసంధానం చేయడం వల్ల సాంకేతికంగా ఉపయోగపడుతుందని టీడీపీ ప్రభుత్వం భావించింది. అయితే జగన్ ప్రభుత్వం రాగానే భూధార్‌ను భూస్థాపితం చేశారు. పేరు మార్చి భూముల సమగ్ర సర్వేను తీసుకొచ్చారు.

జిల్లా భూ సర్వే రికార్డుల కార్యాలయం



ముందుకు రాని కార్మికులు

భూముల రీసర్వేకు కీలకమైన సరిహద్దు రాళ్ల పాతేందుకు కూలీలు ముందుకు రావడం లేదు. రవాణా చార్జీలతో కలుపుకొని రూ.100 ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో రెవెన్యూ సర్వే అధికారులు సతమతమవుతున్నారు. గడువులోగా రీసర్వే పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తున్నా అధికారులు, కూలీలకు కేటాయించిన నిధుల గురించి పట్టించుకోవడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. కొన్ని చోట్ల రాళ్లను రైతులే పాతుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పొలాల మధ్య, ముఖ్య కూడళ్ల, ప్రభుత్వ కార్యాలయ వద్ద రాళ్ల ఉంటున్నాయి. వాటిని తరలించడం వల్ల లోడింగ్ అన్ లోడింగ్ కూలీలు పెరుగుతున్నాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

207 గ్రామాల్లో రీసర్వే చేపట్టాలి



జిల్లాలో 19,32,817 ఎకరాలు ఉంది. మొదటి విడతలో 67 గ్రామాల్లో, రెండో విడతలో 21 గ్రామాల్లో, మూడో విడతలో 160 గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం చేపట్టారు. ఇంకా జిల్లాలో 207 గ్రామాల్లో రీసర్వే చేపట్టాలి. చాలా ప్రాంతాల్లో రీసర్వే నత్తనడకన సాగుతోంది. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో దాదాపు లక్ష రాళ్ల పాతాలి. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం పేరిట వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ రీసర్వే కార్యక్రమం క్షేత్రస్థాయిలో రూపంగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు.

రెవెన్యూ అధికారుల వైఫల్యం

కొత్త పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేసే ముందు వాటిని ఒకసారి తనిఖీ చేసి అన్ని సరిగా ఉన్నాయా లేవా అని సరి చూసుకోవాలని రెవెన్యూ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. కానీ రైతులు పేర్లు, లింగం, ఆధార్, ఫోన్ నెంబరు, ల్యాండ్ పార్సిల్ నెంబర్లను తప్పుగా ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇందులో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోంది.



భూరక్ష రాళ్లు

త్వరలో రీసర్వే పూర్తి చేస్తాం



సర్వే అయిపోయిన భూముల్లో కచ్చితంగా రాళ్ల ఏర్పాటు చేస్తాం. పాస్ పుస్తకాల్లో దొర్లిన తప్పులను సరిదిద్దుతాం. తప్పులున్న పట్టాదారు పుస్తకాలను రైతులకు అందించాం. అన్ని వివరాలు పక్కాగా ఉన్న పట్టాదారు పుస్తకాలను మాత్రమే రైతులకు అందజేస్తాం.

- ఎం.మునికన్నన్, జిల్లా సర్వే భూమి రికార్డు అధికారి



రైతుల ఆందోళన

భూముల రీసర్వే కర్షకులను కలవర పెడుతోంది. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు అందిస్తున్న పత్రాలు తప్పుల తడకగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పాసు పుస్తకాలు వద్దంటూ వెనక్కి ఇచ్చేస్తున్నారు. కొందరు రైతులకు సంబంధించి భూమి తక్కువగా చూపారు. తిరిగి సర్వే చేయాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సచివాలయ రెవెన్యూ సిబ్బందిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రీసర్వే పూర్తయిందని, భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు చెబుతుంటే రైతులు మాత్రం ఇంకా సమస్యలు ఉన్నాయని పేర్కొనడం గమనార్హం. సర్వే జరిగిన తీరు సరిహద్దు రాళ్ల పాతిన విధానాన్ని తప్పుబడుతున్నారు. రీసర్వే అనంతరం ప్రతి భూమికి సర్వే నెంబరుతో పాటు ల్యాండ్ పార్సల్ నెంబరు ఇస్తారు. వీటినే ఎల్‌పీఎన్‌గా పిలుస్తారు. వీటిలో కూడా తేడాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

అందరూ ఓటు వేసేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీటీ నాయుడు

- ఇంటిగ్రేటెడ్ శిక్షణలో బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 2: ఓటర్లు అందరూ తప్పని సరిగా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని ఎమ్మెల్సీ, టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఐటీడీపీ, ఓటర్ వెరిఫికేషన్ సభ్యుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ విచ్చల విడిగా దొంగ ఓట్లను తన క్యాడర్‌తో చేర్పించిందని, వాటిని ఎక్కడికక్కడ పసిగట్టి టీడీపీ శ్రేణులు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకొని వెళ్లేందుకు ప్రయత్నించాలని కోరారు. జరగబోయే సాధారణ ఎన్నికల్లో టీడీపీ క్యాడర్ జిల్లా వ్యాప్తంగా అప్రమత్తంగా ఉండి ఓటర్లు తమ ఓటును వేసుకునే వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. బాబు ష్యూరిటీ ..భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంతో ప్రజలకు మరింత చేరువై వారికి భరోసా బాండ్లపై అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా మహిళా శక్తి, బీసీ చట్టం, యువతకు ఉపాధి, రైతుకు ఆర్థిక సహాయం, పేదలను ధనికులను మార్చడం, ఇంటింటికి తాగునీరు అందించడం వంటి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు నమ్మకం కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్రం రామకృష్ణ, శివశంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.84 కోట్ల నగదు పట్టివేత

4.232 కేజీల బంగారు, ఐదు కేజీల వెండి కూడా..



పట్టుబడిన బంగారు, వెండి, నగదుతో పోలీసులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 2: పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా నగదు రూ.1,84,53,500 నగదు, 4.232 కేజీల బంగారు, ఐదు కేజీల వెండి పట్టుబడ్డాయి. గురువారం రాత్రి స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ఖాజాహుసేన్‌కు సమాచారం రావడంతో హైదరాబాదు నుంచి కోయంబత్తూరుకు వెళుతున్న ఎన్ఎల్ 01 ఎమ్ 2506 నెంబరుగల ప్రైవేట్ స్లీపర్ ఏసీ ట్రావెల్స్ బస్సును ఆపి తనిఖీలు నిర్వహించారు. అందులో ప్రయాణిస్తున్న అమర్ ప్రతాప్ (నంద్యాల) నుంచి రూ.1.20 కోట్ల నగదు, వెంకటేష్ (కోయంబత్తూరు) నుంచి 3కేజీల195 గ్రాముల బంగారం, రూ.19,23,500 నగదు, సెంథిల్ కుమార్ (కోయంబత్తూరు) నుంచి కేజీ 37 గ్రాముల బంగారం, రూ.44 లక్షల 50 వేల నగదు, శబరి రాజన్ (సేలం) నుంచి 5 కేజీల వెండి బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం పట్టుబడిన బంగారం, వెండి, నగదు విలువ రూ.4,59,08,300. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మస్తాన్‌వలి సమక్షంలో పంచనామా నిర్వహించి విజయవాడ ఆదాయపు పన్నుశాఖకు తెలియజేశారు. ఎలాంటి పత్రాలు లేని 5 కేజీల వెండి, 4 కేజీల232 గ్రాముల బంగారు, రూ.1,84,53,500 నగదు సీజ్ చేశారు. శుక్రవారం ఉదయం ఎస్పీ కృష్ణకాంత్ సెట్ కాన్ఫరెన్స్‌లో ఎస్బీ ఖాజాహుసేన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. వాహన తనిఖీల్లో వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం చంద్రశేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు యార్డుకు మహారాష్ట్ర ఉల్లి

- జిల్లా రైతుల ఉల్లిని కొనే నాథుడే లేడు
- పతనమవుతున్న ధరలు



మహారాష్ట్ర ఉల్లితో కర్నూలు యార్డుకు వచ్చిన లారీలు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 2: సాధారణంగా పంట దిగుబడి తగ్గినప్పుడు ఆ సరుకుకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుంది. రైతులు ఆశించిన ధర లభిస్తుంది. అయితే.. ఇందుకు విరుద్ధంగా కర్నూలు జిల్లా ఉల్లి రైతులు కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారు. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు 924 క్వింటాళ్ల ఉల్లిని మాత్రమే అమ్మకానికి తెచ్చారు. గతంలో నాలుగైదు వేల క్వింటాళ్ల ఉల్లిని కర్నూలు మార్కెట్ యార్డుకు తెచ్చినప్పుడు కూడా మూడు వేలకు పైగానే ధర ఉండేది. అయితే అతి తక్కువ సరుకును మార్కెట్‌కు తెచ్చినా ఆశించిన ధర దక్కలేదు. గరిష్ఠ ధర రూ.1,271 కాగా, మధ్యస్థ ధర రూ.1269, కనిష్ఠ ధర రూ.426 పలికింది. తక్కువ సరుకు విక్రయానికి వచ్చినప్పుడు ధర ఆశించిన స్థాయిలో ఉంటుందని రైతులు ఆశిస్తే అందుకు విరుద్ధంగా తగ్గిపోవడం ఇదే మొదటిసారి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున ఉల్లిని అక్కడ కొనుగోలు చేసి ఉమ్మడి కర్నూలు జిల్లా అవసరాలకు తీసుకు వస్తుండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. కర్నూలు మార్కెట్ కమిటీ పాలకవర్గంతోపాటు అధికారులు తమ పరిస్థితిని అర్థం చేసుకుని మహారాష్ట్ర ఉల్లిని అడ్డుకుని తమను కష్టాల నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు. అలాగే కర్నూలు మార్కెట్ యార్డుకు వామును పెద్దఎత్తున విక్రయానికి రైతులు తీసుకువస్తున్నారు. శుక్రవారం 719 క్వింటాళ్లను తీసుకురాగా, ధర గరిష్ఠంగా రూ.22,900 నిర్ణయించారు. మధ్యస్థ ధర రూ.16,160, కనిష్ఠ ధర రూ.1448 దక్కడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు కందులకు కూడా గతంలో ఎన్నడూ లేనంత ధర రైతులకు దక్కుతోంది. 2,607 క్వింటాళ్లను విక్రయానికి రైతులు తీసుకు రాగా, గరిష్ఠ ధర రూ.10,379, మధ్యస్థ ధర రూ.10,196, కనిష్ఠ ధర రూ.601 రైతులకు దక్కిందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు. ఎండుమిరప కాయల ధర కూడా క్రమంగా పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గరిష్ఠ ధర రూ.23,490, మధ్యస్థ ధర రూ.14,589 రైతులకు అందిందని ఆయన తెలిపారు.



ఆ పిల్లలు వాము దొడ్లో ఉన్నారు

మద్దికెర, ఫిబ్రవరి 2 : మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన ఆదురి సురేంద్ర, లత దంపతుల కుమార్తెలు ఉజ్వల, అపూర్వ మాయమయ్యారనే ఆందోళనకు తెరపడింది. చివరికి ఈ చిన్నారులు గ్రామ శివారులోని వాముదొడ్లో కనిపించారు. ఈ పిల్లలు గత మూడు రోజులుగా పత్తికొండలోని బంధువుల ఇంటికి వెళ్లాలని తల్లిదండ్రులను అడుగుతూ వచ్చారు. వాళ్లు అంగీకరించకపోయే సరికి



తల్లిదండ్రుల చెంతకు చేరిన చిన్నారులు

అదృశ్యం కథ సుఖాంతం

ఆదివారం పాఠశాల నుంచి వచ్చాక 7 గంటల ప్రాంతంలో ఈ ఇద్దరు కవల పిల్లలు బ్యాగ్ సర్దుకుని బైటికి వెళ్లారు. దాదాపు అర కిలోమీటరు వెళ్లేసరికి చీకటి పడటంతో భయపడి అక్కడున్న వాముదొడ్లలోనే నిద్రపోయారు. ఇంట్లో పిల్లలు కనిపించకపోయేసరికి తల్లిదండ్రులు, గ్రామస్థులు ఊరంతా వెతికారు. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పరిసరాలన్నీ వెతికారు. శుక్రవారం ఉదయం కర్నూలు నుంచి డాగ్ స్క్వాడ్ ద్వారా వెతికించినా ఫలితం కనిపించలేదు. గ్రామస్థులకు అనుమానం వచ్చి వాముదొడ్లలో ఏమైనా ఉన్నారేమోనని వెతకగా కనిపించారు. చిన్నారులు దొరకడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారుల అదృశ్యంపై టీడీపీ జిల్లా కార్యదర్శి బూదూరు ధనుంజయుడు, సుధాకర్ చౌదరి, ఐ.రాముడు అడిగి తెలుసుకున్నారు.

ఎంపీడీఓలకు నియామక ఉత్తర్వులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 2: సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇతర జిల్లాల నుంచి కర్నూలు ఉమ్మడి జిల్లాకు వచ్చిన 38 ఎంపీడీఓలకు మండలాలను కేటాయిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఉమ్మడి జిల్లా నుంచి అనంతపురం, వైఎస్ఆర్ కడపకు జిల్లాకు బదిలీపై ఎంపీడీవోలు వెళ్లారు. వారి స్థానంలో వచ్చిన ఎంపీడీఓలకు స్థానాలు కేటాయించారు. తక్షణమే ఈ ఎంపీడీవోలు విధుల్లోకి వెళ్లాలని సీఈఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎంపీడీఓ పేరు	పని చేసిన మండలం	జిల్లా	ఉమ్మడి జిల్లాలో కేటాయించిన మండలం
ఎ.వి. శ్రీనివాసులు	విడనపకల్లు	అనంతపురం	డోన్
టి. లక్ష్మీనారాయణ	యాడికి	అనంతపురం	ఆస్పరి
బివి. రవిప్రసాద్	అగలి	అనంతపురం	బేతంచెర్ల
జి. మునెప్ప	అమడగూరు	అనంతపురం	మంత్రాలయం
ఎస్. సాయి మనోహర్	బత్తలపల్లి	అనంతపురం	ప్యాపిలి
ఎస్. గంగావతి	సీకే.పల్లి	అనంతపురం	మిడ్తూరు
కేఎన్. నరేష్‌క్రిష్ణ	చిల్లమాతూర్	అనంతపురం	నందికొట్కూరు
డి. రామారావు	గుడిబండ	అనంతపురం	పత్తికొండ
పి. నరేంద్రకుమార్	హిందూపుర్	అనంతపురం	ఆలూరు
టి. అలివేలమ్మ	కంగనాపల్లి	అనంతపురం	మద్దికెర
ఎస్. బారెన్‌సాహెబ్	కొత్తచెరువు	అనంతపురం	చిప్పగిరి
ఎం. నరసింహనాయుడు	లేపాక్షి	అనంతపురం	కర్నూలు
సీఎల్. సోనిబాయి	మడకశిర	అనంతపురం	గోనెగండ్ల
కేవి. కవిరాజు	ముదిగుబ్బ	అనంతపురం	పగిడ్యాల
బి. శకుంతల	నల్లచెరువు	అనంతపురం	సి.బెళగల్
ఎం. కొండన్న	నల్లమాడ	అనంతపురం	ఎమ్మిగనూరు
వి. సరస్వతి	పరిగి	అనంతపురం	పాములపాడు
ఎస్. శివశంకరప్ప	పెనుకొండ	అనంతపురం	వెల్దుర్తి
డి. రాబర్ట్ విల్సన్	రొద్దం	అనంతపురం	క్రిష్ణగిరి
కే. అజాద్	రోళ్ళ	అనంతపురం	హోళగుంద
బి. విజయలక్ష్మి	తాడిమర్రి	అనంతపురం	తుగ్గలి
బి. కిరణ్‌మోహన్‌రావు	తలుపుల	అనంతపురం	నందవరం
ఎస్. రఘునాథగుప్త	గోరంట్ల	అనంతపురం	కౌతాళం
జి. సౌభాగ్యం	నందలూరు	వైఎస్ఆర్ కడప	నంద్యాల
ఎవి. రమణరెడ్డి	మైదుకూరు	వైఎస్ఆర్ కడప	ఆళ్లగడ్డ
ఎస్. భాగ్యలక్ష్మి	ఎర్రగుంట్ల	వైఎస్ఆర్ కడప	పాణ్యం
సీఏ. జవహర్‌బాబు	----	వైఎస్ఆర్ కడప	కొత్తపల్లి
పి. జయశ్రీ	వల్లూరు	వైఎస్ఆర్ కడప	గూడూరు
ఏ. మల్‌రెడ్డి	రాయచోటి	వైఎస్ఆర్ కడప	అవుకు
ఎస్. విజయరావు	ఓబులవారిపల్లె	వైఎస్ఆర్ కడప	బండిఆత్మకూరు
ఎం. దివ్య	చిన్నమండెం	వైఎస్ఆర్ కడప	కోడుమూరు
ఎస్. రామచంద్ర	టి.సూదపల్లె	వైఎస్ఆర్ కడప	రుద్రవరం
డి. మల్లేశ్వరి	వీరబల్లి	వైఎస్ఆర్ కడప	ఓర్వకల్లు
ఎస్. శ్రీనివాసరెడ్డి	లవ్‌లేడు	వైఎస్ఆర్ కడప	ఆత్మకూరు
ఎస్. శివరామిరెడ్డి	చిట్వేల్	వైఎస్ఆర్ కడప	గడివేముల
జీవి. రఘురామ్	వల్లూరు	వైఎస్ఆర్ కడప	ఉయ్యాలవాడ
ఎస్. ఫణిరాజ్‌కుమారి	రాజంపేట	వైఎస్ఆర్ కడప	శిరివెళ్ల
ఎస్.సూర్యనారాయణ రెడ్డి	ముద్దనూరు	వైఎస్ఆర్ కడప	చాగలమర్రి

8 మంది సీఐలకు స్థానాల కేటాయింపు

కర్నూలు, ఫిబ్రవరి 2: ఇటీవల పదోన్నతి పొందిన 8 మంది సీఐలకు స్థానాలు కేటాయిస్తూ డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.శ్రీధర్	వీఆర్ కర్నూలు రేంజ్	కర్నూలు తాలుకా
ఏ.రామకృష్ణయ్య	వీఆర్, కర్నూలు రేంజ్	గోనెగండ్ల
ఏ.వేణుగోపాల్	వీఆర్ కర్నూలు రేంజ్	సైబర్ క్రైమ్
ఏ.జయన్న	వీఆర్ కర్నూలు రేంజ్	ఫ్యాక్షన్ జోన్ కర్నూలు
ఎస్.వెంకటరమణ	వీఆర్, కర్నూలు	సీసీఎస్ కర్నూలు
ఎం.రామయ్య నాయుడు	పీసీఆర్ ఆదోని	కర్నూలు త్రీటౌన్
ఎల్.విజయలక్ష్మి	వీఆర్ కర్నూలు రేంజ్	పీసీఆర్ ఆదోని
డి.హజీవలి	వీఆర్, కర్నూలు	దిశా పీఎస్ కర్నూలు

ఐదుగురు సీఐలకు రెగ్యులర్:

జిల్లాలో ఐదుగురు సీఐలకు ప్రస్తుతం ఉన్న అటాచ్‌మెంట్లను రెగ్యులర్ చేస్తూ ఎస్పీ జి. కృష్ణకాంత్ ఆదేశాలు జారీ చేశారు. పవన్ కుమార్ (కర్నూలు వన్‌టౌన్), సోమశేఖర్ రెడ్డి (కర్నూలు వన్‌టౌన్- అడిషనల్ పోస్టు), ప్రవీణ్ కుమార్ రెడ్డి (పత్తికొండ రూరల్ సర్కిల్), సురేష్ కుమార్ రెడ్డి (వెల్దుర్తి సర్కిల్), గౌతమి (కర్నూలు ట్రాఫిక్).

ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టుల దరఖాస్తులు



మాట్లాడుతున్న డీఆర్ఓ మధుసూదన్ రావు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : జిల్లాలో ఇళ్ల స్థలాల కోసం 368 మంది జర్నలిస్టులు దరఖాస్తులు చేసుకున్నారని డీఆర్ఓ మధుసూదన్‌రావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్ఓ చాంబర్‌లో జర్నలిస్టులు ఇళ్ళ స్థలాల కోసం చేసుకున్న దరఖాస్తుల వెరిఫికేషన్‌పై ఆయన తహసీల్దార్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ జీఓ 535 ప్రకారం జర్నలిస్టుల నుంచి ఇళ్ల స్థలాల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన వెరిఫై చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరిప్రసాద్, సమాచార శాఖ ఉపసంచాలకులు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 2: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారని ఆయన తెలిపారు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11 నుండి 12 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12 గంటల నుండి 1 గంట వరకు 5వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 1 గంట నుండి 2 గంటల వరకు 4వస్థాయి సంఘం, 2.30 గంటల నుండి 3.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, 3.30 గంటల నుండి 4.30గంటల వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

డోలమైట్ ట్రాక్టర్ సీజ్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 2: డోన్ పరిధిలోని హెచ్. కొట్టాల, పెద్దమల్కాపురం ప్రాంతాల్లో డోలమైట్ తరలిస్తున్న ఒక డోలమైట్, మరొక రాతిచిప్స్ ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం డోన్ పరిధిలో తనిఖీలు నిర్వహించగా రాయల్టీ లేకుండా ఈ రెండు ట్రాక్టర్లలో డోలమైట్, రాతి చిప్స్ తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్ ఇతర ఇతర సిబ్బంది పాల్గొన్నారని పెర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టండి



కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల సన్నద్ధత, ఓటర్ల జాబితా అంశాలపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితా ప్రచురణ అయ్యాక అందులోంచి ఓటర్ల తొలగింపునకు జిల్లా ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరి అన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జి. సృజన , మురళి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేశారు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు
- కలెక్టరేట్ ఎదుట తెలుగు యువత నిరసన



కలెక్టరేట్ ఎదుట చేపలు అమ్ముతూ నిరసన

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మోసం చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు అబ్బాస్ అధ్వర్యంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకుని చేపలు, మాంసం విక్రయించి వినూత్నంగా నిరసన తెలిపారు. మాట్లాడుతూ అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు వలంటీర్లకు ప్రజాధనాన్ని దోచిపెట్టారని ధ్వజమెత్తారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీ చేస్తామని 2019 ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ యువత నిట్టనిలువునా ముంచారని మండిపడ్డారు. డీఎస్సీ ద్వారా 6100 పోస్టులను భర్తీ చేయనున్నట్లు మంత్రి వర్గంలో వెల్లడించడం కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయాన నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు కల్పించే నిమిత్తం స్కిల్ డెవలంప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యావంతులకు సాంకేతిక శిక్షణను ఇప్పించారని అన్నారు. యువతను మోసగించిన జగన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు పీజీ గోపినాథ్, సోమిశెట్టి నవీన్, జూటూరు రవి, సందీప్, రాజు, టీఎన్ఎస్ఎఫ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న ఎస్వీ విజయ మనోహరి

మద్దికెర, ఫిబ్రవరి 2: కర్నూలు జిల్లాలో మొత్తం 99 సహకార సంఘాలు ఉన్నాయని, ప్రతి సంఘాన్ని బలోపేతం చేస్తామని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయ మనోహరి, పత్తికొండ ఎమ్మెల్యే కె. శ్రీదేవి అన్నారు. శుక్రవారం మద్దికెర సహకార సంఘంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జనరిక్ మందుల షాపులను ప్రారంభించారు. అనంతరం మద్దికెర సహకార సంఘం చైర్మన్ వై.శాంతన్న అధ్యక్షతన జరిగిన సహకార సంఘం సభలో వారు మాట్లాడుతూ మద్దికెర సహకార సంఘం దాదాపు 20 కోట్ల లావాదేవీలతో నడుస్తున్నదని అన్నారు. ఈ సహకారసంఘం జిల్లాకే ఆదర్శంగా నిలిచిందన్నారు. జనరిక్ మెడిసిన్ వాడడం వల్ల ప్రజలకకు ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శాంతన్న, జడ్పీటీసీ సభ్యులు డి. మురళిధర్ రెడ్డి, ఎంపీపీ అనితా యాదవ్, సర్పంచ్ బండారు సుహాసిని, మాజీ ఎంపీపీ మల్లికార్జునయాదవ్, మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, సీఈవోలు రామాంజనేయులు, ఎర్రిస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మద్దికెర గ్రామంలోని సచివాలయం, ఆర్‌బీకే కేంద్రం, సీసీ రహదారుల పనులను ఎమ్మెల్యే కె.శ్రీదేవి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు రూ.65 లక్షలు వెచ్చించి నిర్మించిన అభివృద్ధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగభూషణం, వ్యవసాయ శాఖ అధికారి రవి తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరితరెడ్డి



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 2: రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడం టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో రాష్ట్ర టీడీపీ పిలుపు మేరకు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు ఘనంగా ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమెతో పాటు నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని టీడీపీ మొదటి విడతలో మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహానాడులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో అనేక హామీలు ఇచ్చి అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, వెంకటరమణ, సుధాకర్‌రావు, శ్రీనివాసులు, రామకోటేశ్వరరావు, మధుసూదన్ గౌడు, విజయరాఘవరెడ్డి, అయ్యస్వామి, శ్యాం సుందర్‌రెడ్డి, రఫీ, బాషా, రమణయ్య, మద్దిలేటి రామాంజనేయులు, ఖాదర్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ రెడ్డి, సంజీవ, నాగమల్లేష్, గుట్టపాడు చిన్న, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వైసీపీ నుంచి 40 మంది టీడీపీలో చేరిక మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలోని వైసీపీ నాయకుడు భైరాపురం సుధాకర్ రెడ్డితో పాటు 40 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 40 మంది టీడీపీలో చేరారు.

ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జిగా బుట్టా రేణుక

● రుద్రగౌడ్‌కు మొండి చెయ్యి



బుట్టా రేణుక



రుద్రగౌడ్

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 2: వైసీపీ అభ్యర్థుల ఆరో జాబితాను పార్టీ అధి నాయకత్వం శుక్రవారం విడుదల చేసింది. ఇందులో ఎమ్మిగనూరు ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ బుట్టా రేణుకను నియమించింది. వయోభారం కారణంగా సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి అధిష్టానం టికెట్ నిరాకరించింది. ఆశావాహులు ఎక్కువగా ఉండటంతో పార్టీ బీసీ నినాదాన్ని అందుకుంది. ఎమ్మెల్యే అభీష్టం మేరకే అభ్యర్థిని నిర్ణయించడానికి ఒప్పుకుంది. పట్టణానికి చెందిన మాచాని వెంకటేష్‌ను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించటంతో ఆయననే నియమించింది. అయితే సర్వేలు మాచాని వెంకటేష్‌కు వ్యతిరేకంగా రావటంతో ఎమ్మెల్యేతో పలు దఫాలుగా చర్చించి తప్పని పరిస్థితుల్లో ఒప్పించింది. ఇందులో భాగంగానే మాజీ ఎంపీ బుట్టా రేణుకను గత వారం రోజుల క్రితం టికెట్ ఖరారు చేసింది. ఐదో జాబితాలోనే ఆమె పేరు ప్రకటిస్తారని భావించినప్పటికీ అప్పటికి వెలువడలేదు. ఎట్టకేలకు ఆరో జాబితాలో బుట్టా రేణుక పేరును ప్రకటించింది. అయితే స్థానిక చేనేత సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు టికెట్‌ను ఆశించారు. అధిష్టానం వారిని పక్కన బెట్టి నాన్‌లోకల్ అయిన బుట్టా రేణుకను ఎంపిక చేయటంపై స్థానిక చేనేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మాచాని వెంకటేష్‌ను అనుచరులకు పరిచయం చేస్తూ బుట్టా రేణుక నాన్ లోకల్ అన్న ఎమ్మెల్యే ఇప్పుడు ఎందుకు ఒప్పుకున్నారని చేనేత సామాజికవర్గ నేతలు ప్రశ్నిస్తున్నారు.

● **బుట్టాకు వ్యతిరేకంగా బంధువర్గం** బుట్టా రేణుకకు మాచాని కుటుంబంతో బంధుత్వం ఉంది. మాచాని రఘునాథ్ కుమారుడు డా.సోంనాథ్ స్వయాన బుట్ట రేణుక అల్లుడు. దీన్ని దృష్టిలో పెట్టుకొనే వైసీపీ అధిష్టానం బుట్టకు టికెట్ కేటాయించింది. అయితే బుట్టకు వ్యతిరేకంగా అల్లుడు సోంనాథ్ టీడీపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. సీటు రానిపక్షంలో టీడీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని ప్రకటించాడు. బుట్టా రేణుకను బంధువులే వ్యతిరేకించటం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

● **రుద్రగౌడ్‌కు మొండి చెయ్యి:** వైసీపీ అధిష్టానం ఎమ్మిగనూరు సీటు బీసీలకు కేటాయించటంతో తనకు టికెట్ కేటాయించాలంటూ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై రుద్రగౌడ్ తీవ్రంగా ప్రయత్నించాడు. ఎమ్మెల్యే ఒప్పుకుంటే సీటు కేటాయిస్తామంటూ అధిష్టానం ఫిటింగ్ పెట్టింది. అయితే ఎమ్మెల్యే వ్యతిరేకించటంతో రుద్రగౌడ్‌కు సీటు దక్కకుండా పోయింది. దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించటం చర్చనీయాంశమైంది.

వేరుశనగ పాసింగ్ విధానానికి స్వస్తి పలకాలి

● కుదరదంటున్న వ్యాపారులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 2: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన వేరుశనగ దిగుబడికి పాసింగ్ విధానానికి స్వస్తి పలకకపోతే గుర్తింపు రద్దు చేస్తామని మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో వేరుశనగ వ్యాపారులు కమిషన్ ఏజెంట్, రైతు సంఘ నాయకులతో వేరుశనగ పాసింగ్‌పై చర్చలు జరిగాయి. ఎంతో కష్టపడి వ్యయప్రయాసలతో పండించిన దిగుబడిని విక్రయానికి చేస్తే నాణ్యత పేరుతో పాసింగ్ అంటూ వారిని ఇబ్బంది పెట్టడం మంచిది కాదని కార్యదర్శి వారిని హెచ్చరించారు. వ్యాపారులు తాము 50 ఏళ్లుగా పాసింగ్ విధానాన్ని మార్కెట్లో కొనసాగిస్తున్నామని, నాణ్యత లేకపోవడంతోనే పాసింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. రైతు సంఘం నాయకులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతుల వల్ల మార్కెట్ కమిటీ నడుస్తుందని, అలాంటి రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు. వేరుశనగ నాణ్యత లేకపోతే కొద్దిగా ధర తగ్గించి కనాలిగాని ఇలా గంటల తరబడి పాసింగ్ విధానాన్ని కొనసాగించడం ఏమిటన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, వీరభద్ర గౌడ్, వేరుశనగ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు శరణప్ప, సహాయ కార్యదర్శి శాంత కుమార్ పాల్గొన్నారు. వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో భారీ మెజారిటీ తీసుకురావాలని కోరారు.

6న సర్పంచుల చలో అసెంబ్లీ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 2: అసెంబ్లీ సమావేశాలను పురస్కరించుకుని ఈ నెల 6న సర్పంచుల చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్లు, గ్రామ పంచాయతీలను సర్పంచుల అధీనంలోనే పని చేయించాలని, ఉపాధి హామీ నిధులను సర్పంచుల చేతనే ఖర్చు చేయించాలనే తదితర డిమాండ్లతో అసెంబ్లీని ముట్టడిస్తున్నామన్నారు.

బైక్‌పై నుంచి కాలువలోపడి యువకుడి మృతి

- ఒకే రోజు మూడు ప్రమాదాలు..
- కోసిగి మండలంలో చోటు చేసుకున్న వరుస ఘటనలు

కోసిగి, ఫిబ్రవరి 2: మండలంలోని కోల్‌మాన్ పేట, తిప్పలదొడ్డి గ్రామాల మధ్య ఉన్న ఎల్లెల్సీ కాలువలో బైక్ అదుపు తప్పి కాలువలో పడి కోసిగిలోని 3వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన కలశం రవి (33) అనే యువకుడు మృతి చెందాడు. గురువారం రాత్రి ఆయన భార్య గ్రామమైన చూడీ గ్రామానికి వెళ్తుండగా..ఈ ప్రమాదం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం సమీప పొలాల్లోని రైతులు కౌతాళం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య లింగమ్మ, నాలులు నెలల కుమారుడు ఉన్నారు. అట్లాగే దుద్ది చెరువు సమీపంలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదంలో బైక్‌లు అదుపు తప్పి కోసిగికి చెందిన నాడిగేని వీరేష్, పెద్దతుమ్మలం గ్రామానికి చెందిన రామకృష్ణ అనే యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం వీరిని కర్నూలు తరలించారు. కోసిగి నుంచి హాల్వీ దాకా దాదాపు 10 కి.మీల రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

కారు- ఇసుక టిప్పర్ ఢీ

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 2: ఎమ్మిగనూరు - కర్నూలు ప్రధాన రహదారిపై కారు, ఇసుక టిప్పర్ ఢీకొన్నాయి. ఈ సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎమ్మిగనూరుకు చెందిన శశిధర్ కర్నూలు నుండి ఎమ్మిగనూరుకు కారులో వస్తున్నాడు. ఇతని కారు, ఎమ్మిగనూరు నుండి కర్నూలు వైపు వెళ్తున్న ఇసుక టిప్పర్ కర్నూలు ప్రధాన రహదారిలోని అగ్రిగోల్డ్ ప్లాట్ల సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఏఎస్ఐ బాలనాయక్ తెలిపారు.

పెండింగ్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరిస్తాం



వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 2: భారత ఎన్నికల సంఘం సూచించిన తాజా ఆదేశాలను పరిగణలోకి తీసుకొని పెండింగ్ క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరిస్తామని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు నివేదించారు. శుక్రవారం ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ ఎన్నికల సన్నద్ధత, ఎలక్టోరల్ రోల్ ఫార్మ్ 6,7,8ల పెండింగ్, పోలింగ్ కేంద్రాల సదుపాయాలు, భద్రత, వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, కౌంటింగ్ సెంటర్లు తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితా జనవరి 22వ తేదీ ప్రచురణకు ముందు ఫారం 6,7,8కు సంబంధించి 17500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, జనవరి 23 నుంచి ఇప్పటి వరకు 8991 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటన్నింటినీ ఇంటింటి వెరిఫికేషన్ చేయించి జాబితాలో పొందుపరుస్తామన్నారు. యువ ఓటర్ల నమోదుకు స్పెషల్ కాంపెయిన్ నిర్వహించి నమోదుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపునకు సంబంధించిన నివేదిక ప్రతిపాదనలు కలెక్టరేట్‌కు పంపి ఆమోదం పొందిన తర్వాతనే జాబితాలో తొలగించాలని ఈఆర్వో, ఏఈఆర్వోలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ డా.కె శ్రీనివాసులుతోపాటు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, అన్ని నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

తుగ్గలి, ఫిబ్రవరి 2: తల్లిని హత్య చేసిన కేసులో నిందితులు లిఖిత్ రెడ్డి, పెద్ద లింగారెడ్డిలను గురువారం అరెస్టు చేసినట్లు పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన మండల పరిధిలోని రాతన కొత్తురులో పచ్చర్లపల్లి లక్ష్మీదేవిని ఆమె కుమారుడు లిఖిత్ కుమార్ రెడ్డి గుంటక మేటుతాడుతో తలపైమోది హత్య చేశారని అన్నారు. ఆ హత్యకేసులో సహ నిందితుడు లింగారెడ్డితో సహ పరారైన లిఖిత్ కుమార్ రెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

నిబంధనలను పాటించండి

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. సృజన ఈఆర్వోలను ఆదేశించారు. శుకవారం కలెక్టర్ ఈఆర్వోలు, నోడల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ఓ హ్యాండ్ బుక్‌ను ఈఆర్‌ఓలు తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలి



ఆర్ఐవోకు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 2: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ కళాశాలలో జరిగే సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులను ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక ఆర్ఐవో కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్ఐవో గురువయ్యశెట్టికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.సోమన్న మాటాడుతూ కొన్ని ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు కళాశాలలో కొంత మంది లెక్చరర్లు పరీక్షలకు హాజరు కాని విద్యార్థులను కూడా పాస్ చేయిస్తామని కళాశాల యజమాన్యాలు విద్యార్థులకు లేనిపోని ఆశలు కల్పిస్తున్నారని అన్నారు. కళాశాలలో విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలను తిరిగి వెనక్కి ఇప్పించాలని కోరారు. ఆర్ఐవో గురువయ్యశెట్టి స్పందిస్తూ కళాశాల యజమాన్యాలు విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నట్లు తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐవోకు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మునిస్వామి, అశోక్, పృధ్వీ, చందు, సురేష్ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించండి



విమానాశ్రయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 2: ఓర్వకల్లు విమానాశ్రయంలో పని చేస్తున్న ఉద్యోగులకు జీతాలు తక్షణమే చెల్లించాలని శుక్రవారం ధర్నా నిర్వహించారు. తమ పొలాలను ఎయిర్‌పోర్టుకు స్వాధీనం చేశామని, అందుకు అక్కడ ఉద్యోగాలు ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్లుగా ఎయిర్‌పోర్టులో విధులు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. తమకు ఏపీ కాస్ట్ సంస్థ నుంచి తొలగించి సాయి సంపత్ సంస్థలో చేర్చడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వారు తెలిపారు. సాయిసంపత్ సంస్థ 7 నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. సిబ్బంది జీతాలు అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని అన్నారు. ఇప్పటికైనా యజమాన్యం తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాధ్యతగా పని చేస్తే విజయం ఖాయం

గూడూరు, ఫిబ్రవరి 2: క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు బాధ్యతగా పని చేస్తే టీడీపీ విజయం ఖాయమని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ అన్నారు. శుక్రవారం గూడూరులో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ ఏడు, ఎనిమిది యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలకు ఓటరు వెరిఫికేషన్, బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎల్ సుధాకర్ రెడ్డి, మన్నన్ బాషా, సుమన్ బాబు, నాగరత్నారావు, శ్రీనివాసులు, మునగాల గోపాల్, కళ్యాణ్ రఘు, సులేమాన్, గిడ్డయ్య, ఇసాక్, ఎల్లయ్య, కడియాల దివ్యరాణి, భార్గవి పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి..

సి.బెళగల్, ఫిబ్రవరి 2: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి అకెపోగు ప్రబాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో క్లస్టర్, బూతు ఇన్‌చార్జిలు, సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆకెపోగు ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు నాలుగున్నర ఏళ్ల పాలనలో చేయని అభివృద్ధి ఇప్పుడిప్పుడు శంకుస్థాపనలు, శిలాఫలకాలు ప్రారంభిస్తే ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందుగౌడు, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోడుమూరు బీసీసెల్ నాయకుడు చిన్న ప్రభు, ఎస్సీ సెల్ నాయకుడు ఆదాం, మారెప్ప, తిరుమలేసు, అడివప్ప పాల్గొన్నారు.

కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక బడ్జెట్

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 2: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక బడ్జెట్‌లా ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజల ఆదాయం 50 శాతం పెరిగిందని ప్రభుత్వం అబద్ధాలు చెబుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ కోసం ఈ బడ్జెట్ లో పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారని ఆరోపించారు. జిల్లాలో కొత్త రైల్వే లైన్ల మాటే బడ్జెట్‌లో లేకపోవడం శోచనీయమన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 2: నగరంలోని 25వ వార్డులో వివిధ అభివృద్ధి పనులను మేయర్ బీవై.రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌లు ప్రారంభించారు. శుక్రవారం రూ.50 లక్షలతో బిర్లాగేట్ వద్ద కమ్యూనిటీ హాల్, హౌసింగ్‌బోర్డు కాలనీలో రూ.40 లక్షలతో హెచ్ డీపీఈ పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన, రాగూర్‌నగర్‌లో రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ కాలువలను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, నాయకులు గడ్డం రామక్రిష్ణ, ఈఈ షాకీర్, డీఈ నరేష్, నాయకులు కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

పార్కులను అభివృద్ధి చేయండి

పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి



పార్కును పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు, అపార్ట్‌మెంట్ ప్రతినిధులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 2: నగరంలోని ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే పార్కులను అభివృద్ధి చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అశోక్‌నగర్ శివాలయం పక్కనే శిథిలావస్థలో ఉన్న పార్కులను స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1986లో తాను కౌన్సిలర్‌గా పదవీ కాలం పూర్తయ్యేనాటికి పార్కును పూర్తి చేశామన్నారు. అప్పటి నుంచి అధికారుల నిర్లక్ష్యం వల్ల పార్కు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. 50 ఏళ్ల క్రితం స్థానిక ప్రజలు రూ.20 కోట్ల విలువైన భూమిని మున్సిపాలిటీకి అప్పచెప్పారని అన్నారు. ఇప్పటి వరకు మున్సిపల్ అధికారులు కట్టిన ప్రహరీ కూలిపోతూనే ఉన్నాయన్నారు. గోడలు నిర్మించడం వల్ల పార్కు ఎత్తు పెరిగిందే కాని మొక్కలు పెరగలేదన్నారు. అన్ని పన్నులు సక్రమంగా చెల్లిస్తున్న పార్కును ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో స్థానిక అపార్ట్‌మెంట్ ప్రతినిధులు విజయ్, సురేష్, శేఖర్, వెంకట్రామిరెడ్డి, చాంద్‌బాషా పాల్గొన్నారు.

టీడీపీలోకి ఊపందుకున్న వలసలు

» టీజీ భరత్, గౌరు దంపతుల సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 2: తెలుగుదేశం పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయి. కర్నూలు నగరంలోని ఒకటో వార్డు పరిధిలోని కేఎంసీ క్వార్టర్స్ వేల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన ప్రజలు శుక్రవారం మౌర్యాఇన్‌లో టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ కేఎంసీ క్వార్టర్స్ ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కేఎంసీ క్వార్టర్స్‌తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో మల్లికార్జున, సురేష్, రాముడు, క్రిష్ణయ్య, రాజు, జయమ్మ, రత్నమ్మ, మద్దమ్మ, గంగమ్మ, సారదమ్మ, రాజేశ్వరి ఉన్నారు. వార్డు నాయకులు భాస్కర్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సమస్యలపై నాయకులను నిలదీయాలి: డబ్బులు సంపాదించేందుకు రాజకీయాల్లోకి వచ్చిన నాయకులను సమస్యలపై ప్రజలు నిలదీయాలని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని 11వ వార్డు ఖడక్ పూర వీధిలో నాయకుడు మహబూబ్ ఖాన్ అధ్వర్యంలో నిర్వహించిన దోమలపై దండ యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని



గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

హైపోద్రావణం పిచికారి, ఫాగింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానం తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఖాదర్ బాషా, చంద్రశేఖర్, సబా, సలీం, ఆసిఫ్, జలీల్, పండు, ఈశ్వర్, చిన్నమ్మి, పెంచలయ్య, అనంతయ్య పాల్గొన్నారు.

● గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన 20 కుటుంబాలు

కల్లూరు: ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచు ఖాదర్‌బాషాతోపాటు, 20 కుటుంబాలు పాలకొలను సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీ పాణ్యం, నందికొట్కూరు ఇన్‌చార్జిలు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డిల సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తన స్వగృహంలో గౌరు దంపతులు టీడీపీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలతో విసుగుచెంది టీడీపీలో చేరినట్లు మాజీ ఉప సర్పంచు ఖాదర్‌బాషా తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఖాజాహుసేన్, గోపాల్, రసూల్, బోయ భాస్కర్, సద్దాంఖాన్, పెద్దహనీఫ్, నబిసాహేబ్, చిన్నహుసేన్, షేక్‌మాబాషా, ఆలీఖాన్, మద్దిలేటి ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



నందనపల్లెలో టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలకు వివరిస్తున్న దస్తగిరి

కర్నూలు(రూరల్), ఫిబవరి 2: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ కోడుమూరు నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. వైసీపీ పాలనపై ప్రజలు విసుగు చెందారని, ఆ పార్టీ నాయకులను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కర్నూలు రూరల్ మండలం నందనపల్లె, భూపాల్‌నగర్, ఎస్ఎస్‌తాండల్లో బొగ్గుల దస్తగిరి శుక్రవారం ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయక నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని ఎన్నికల ముందు నిరుద్యోగులకు హామీనిచ్చిన జగన్‌రెడ్డి గెలిచాక పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, మద్దిలేటి, వెంకటేష్, ధనుష్, వి.మద్దిలేటి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

సి.బెళగల్, ఫిబ్రవరి 2: మండలంలోని పోలకల్లు నుంచి ముడుమాల ఆర్ఎంటీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్వర్యంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి భూమి పూజ చేశారు. బొంతల ఓబులేసు, మాజీ ఎల్లెల్సీ చైర్మన్ చిన్న కొండయ్య, సోమశేఖరరెడ్డి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎంపీడీవో

సి.బెళగల్, ఫిబ్రవరి 2: సి.బెళగల్ ఎంపీడీవో అనంతపురం జిల్లా నల్లచెరువు నుంచి సి .బెళగల్ ఎంపీడీవోగా శకుంతల శుక్రవారం విధుల్లో చేరారు. ఈసందర్భంగా శకుంతల మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. జాబుకార్డులు లేని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో శకుంతల

వెయ్యి కుటుంబాల దత్తత

» ఎన్ఎంసీ ఆదేశాల మేరకు ఎంబీబీఎస్ విద్యార్థుల నిర్ణయం

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 2: నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఆదేశాల మేరకు సీబీఎంఈ కరికులం కింద కర్నూలు మెడికల్ కాలేజీ మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు కర్నూలులో వేయి కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఈ ప్రోగ్రాంలో వైద్య విద్యార్థులు ఈ కుటుంబాలకు నిరంతరం ఆరోగ్య పర్యవేక్షణ నాలుగు సంవత్సరాలు ఆరోగ్య పరిరక్షణ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. సుధాకుమారి మాట్లాడుతూ ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 250 మంది ఉంటారని, ఈ నాలుగేళ్లు విద్యార్థులు ఈ కుటుంబ సభ్యులకు వైద్యసేవలు అందిస్తారన్నారు. ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేయడం, అవసరమైతే ఆసుపత్రిలో చేర్పించడం వంటి పనులు చేస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డా.సింథియా శుభప్రద, యు. వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పారా మెడికల్ సిబ్బంది సాయిరాం, మాదవరాజు, సురేష్, నాగేశ్వరమ్మ, సుభాషిణి, భాగ్యమ్మ పాల్గొన్నారు.



బుధవారపేటలో ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న వైద్య నిపుణులు

రేపు దూదేకుల సమావేశం



మాట్లాడుతున్న దూదేకుల సంఘం నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 2: జిల్లాలో దూదేకుల హక్కుల సాధన కోసం ఆదివారం సాయంత్రం 4 గంటలకు కర్నూలు జిల్లా పరిషత్‌లోని మండల పరిషత్ సమావేశ భవనంలో జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహ్మద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దూదేకుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ నుంచి పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన దీక్ష చేపడుతామన్నారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహ్మద్, రాష్ట్ర నాయకులు బాబర్, ఇమామ్‌కాశీం, రాష్ట్ర ఉద్యోగ సంఘం అధ్యక్షుడు సిద్దయ్య పాల్గొంటారని తెలిపారు.

కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్



కల్వర్టు పనులు పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 2: నగరంలోని పాతబస్తీలో జరుగుతున్న కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం బృందం కల్వర్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ శంకర్ మిఠాయి దుకాణం ముందు బాగా ఉండే కల్వర్టును తొలగించి వారం అవుతున్న వాటిని నిర్మించకపోవడం దారుణమన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిత్యం రద్దీగా ఉండే పాతబస్తీలో బాగా ఉండే కల్వర్టులను తొలగించి రిలియన్స్ కేబుల్ వైర్లు ఉండటం వల్ల మున్సిపల్ అధికారులు పనులు ప్రారంభించకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నాయకులు అబ్దుల్‌దేశాయ్, రామక్రిష్ణ, ఇంతియాజ్ పాల్గొన్నారు.

వంద రోజుల పని దినాలు కల్పించాలి

● డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 2: ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం కింద వంద రోజులు పని దినాలు కల్పించాలని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పత్తికొండ క్లస్టర్ సమావేశ భవనంలో క్లస్టర్ ఈపీవోలు, టీసీలు, టీఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వంద రోజులు పని దినాలు కల్పించేందుకు అందుకు తగ్గట్లు పనులు కూడా గుర్తించాలన్నారు. జాబ్ కార్డులు లేని వారికి కొత్త జాబ్ కార్డులను అందించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్కరికి పనులు కల్పించడమే కాకుండా వేతనాలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఈపీడీ ఫక్కీరప్ప, కోర్సు డైరెక్టర్ ప్రదీప్‌నాయక్, పత్తికొండ ఏపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయండి



డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: అట్రాసిటీకి గురైన బాధితులకు మానటరింగ్ రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం రాయలసీమ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతరత్నం, జిల్లా అధికార ప్రతినిధి మీసాల మల్లికార్జున, కన్వీనర్ స్వాములు డీఆర్వో మధుసూదన్‌రావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్ల నుంచి అట్రాసిటికి గురైన బాధితులకు ప్రభుత్వం నుంచి మాన టరింగ్ రిలీఫ్ ఫండ్ రావడం లేదని అన్నారు.

సిద్ధా ఆయుర్వేదం ఆరోగ్యానికి మంచిది



ర్యాలీ నిర్వహిస్తున్న క్రీడాకారులు

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 2: సిద్ధా అయుర్వేదంతో ఆరోగ్యానికి ఎంతో మంచిదని కర్నూలు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. సిద్ధా ఆయుర్వేదంపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన ర్యాలీ శుక్రవారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియానికి 2వేల కి.మీలు పూర్తి చేసుకుంది. ఈ ర్యాలీని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాశ్ శెట్టి, అయుష్ శాఖ మెడికల్ ఆఫీసర్లు చంద్రశేఖర్ రెడ్డి, డా.ప్రభాకర్ రెడ్డి, డా.ప్రసాద్, సైంటిస్ సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ సిద్ధ డా.ఏ.రాజేంద్ర కుమార్, ట్రాఫిక్ కంట్రోల్ ఎయిర్‌పోర్టు అథారిటి డీజీఎం బెంజిమన్‌లు హాజరై కర్నూలుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డా.సురేష్ ముత్తు కోటేశ్వరణ్, దయానందరెడ్డి డా.శ్యాంరాజ్‌లు మాట్లాడుతూ డిల్లీ నుంచి కన్యాకుమారి వరకు మొత్తం 3,333 కి.మీలు ప్రయాణించి 8 రాష్ట్రాలు 21 నగరాల్లో ఈ ర్యాలీని కొనసాగించి సిద్ధా ఆయుర్వేదంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో క్రీడాకారులు, వాకర్లకు సిద్ధా ఆయుర్వేద కిట్లను పంపిణీ చేశారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 2: 73వ జూనియర్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున కర్నూలు క్రీడాకారులు హర్షద్ బాషా, హాసిని లు ఎంపికైనట్లు జిల్లా బాస్కెట్‌బాల్ కార్యదర్శి భానుప్రకాష్ తెలిపారు. 8వ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నూజివీడు, ఏలూరు జిల్లాలో 2023 జూన్ 28, 29, 30 తేదీల్లో జిల్లా తరపున బాలుర విభాగంలో ఎస్కే హర్షద్‌బాషా, అమ్మాయిల విభాగంలో కే.హాసిని ప్రతిభ కనబరిచారు. వీరు ఇరువురు 2024 జనవరి 19వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీన జరిగే బాస్కెట్‌బాల్ అండర్-18 బాస్కెట్‌బాల్ జూనియర్స్ విభాగంలో జాతీయ స్థాయి కోచింగ్ క్యాంపులో సెలెక్ట్ అయి రాష్ట్ర జట్టు తరపున ఈ నెల 4 నుంచి 11 వ తేదీ వరకు ఒడిస్సా భువనేశ్వర్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైయ్యారని భానుప్రసాద్, ప్రెసిడెంటు నీలిమ తెలిపారు.



ఎంపికైన హర్షద్ బాషా, హాసిని

ఇద్దరి అరెస్టు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 2: ఆదోని మండలం ఆరేకల్లుకు చెందిన రామాంజనేయులు, వీరేష్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఆటోలో వీరు ఆదోని నుంచి మద్యాన్ని తరలిస్తుండగా శుక్రవారం అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 150 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ నీరంజన్ రెడ్డి తెలిపారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఈవో శ్యామేల్‌పాల్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 2: డివిజన్ స్థాయిలో జరిగే ఉపాధ్యాయ శిక్షణా తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో శ్యామేల్‌పాల్, ఎస్ఎస్ఏ ఏపీసీ విజయ జ్యోతి కుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక బీ.క్యాంపులోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఐసీటీ-సిమిలేషన్స్‌పై ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. కర్నూలు డివిజన్‌లోని 8 మండలాల్లో పని చేస్తే గణితశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసీటీ ప్రాముఖ్యత, వివిధ రకాల అప్లికేషన్లను ఎలా ఉపయోగించాలి.. పిల్లలకు ఎలా అర్థమవుతుందో వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారదాదేవి, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఎస్ఎస్ఏ ఏఎంవోలు రఫి, ఆర్పీలు ఖాజావలి, అమీద్, సునందరావు, హరీఫ్, హైమావతి, హుశేన్ పాల్గొన్నారు.

ప్రతి దుకాణదారుడు సర్టిఫికెట్ తీసుకోవాలి

ఉప కమిషనర్ కే వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఉప కమిషనర్ కే వెంకటేశ్వర్లు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 2: అంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం 1988 కింద ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా కార్మిక శాఖ నుంచి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొంది ఉండాలని కార్మిక శాఖ ఉపకమిషనర్ కే.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వర్తక, వాణిజ్య, వ్యాపార సముదాయాల యజమానులతో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత వ్యాపార దుకాణాలు, సంస్థలు కలిగిన ప్రతి ఒక్కరూ లైసెన్సు పొందాలన్నారు. ఈ నెల 29 లోపు అన్ని దుకాణాలు, సంస్థల యజ మానులు లైసెన్సు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ సాంబశివ, సహాయ కార్మిక శాఖ అధికారులు హేమాద్రి, ఆర్.కేశన్న, ఎంఎల్. రాంప్రసాద్, టి.శ్రీలక్ష్మి, దుకాణాల యజమానులు విజయ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

చెస్ బోర్డులు పంపిణీ



చెస్ బోర్డులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 2: పట్టణంలోని కస్తూర్బా, జడ్పీ బాలికల, బాలురు పాఠశాలలో చెస్ బోర్డులను పంపిణీ చేసినట్లు టీడీపీ నాయకుడు, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం గూడూరులో ఆయన మాట్లాడుతూ జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి కుమారుడు దివంగత రాజావర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం రవి నాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు చెస్ బోర్డులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, పౌలు, విజయ్, మధు, విష్ణు సేన అభిమానులు పాల్గొన్నారు.

రాహుల్ కారుపై దాడి హేయం

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 2: రాహుల్‌గాంధీ కారుపై దాడి హేయమైన చర్య అని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ బతుకన్న అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీపై పశ్చిమబెంగాల్‌లో జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. ఎస్పీజీ భద్రత ఉండే రాహుల్‌పై దాడి చేశారంటే ఇక సామాన్యుల పరిస్థితి ఎంటని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దేశంలో మతకలహాలు, దాడులు, కుల రాజకీయాలతో దేశాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. ఈసమా వేశంలో జేమ్స్, ప్రతాప్, ఆశీర్వాదం పాల్గొన్నారు

అనుమానితులపై ప్రత్యేక నిఘా పెట్టండి

గోనెగండ్ల, ఫిబ్రవరి 2: గ్రామాల్లోని వీధులలో అనుమానంగా సంచరిస్తుంటే వారిపై నిఘా వేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తిమ్మారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రాత్రి పూట పిల్లలను ఎత్తుకుపోయే ముఠా తిరుగుతున్నట్లు వస్తున్న వదంతులను నమ్మవద్దని ఆయన అన్నారు. అనుమానంగా తిరుగుతున్నవారి ఫొటోలను సెల్ తీసి పోలీసులకు పంపాలన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయండి

● సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ



రైల్వే బ్రిడ్జి వద్ద అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఆదోని రూరల్, ఫిబ్రవరి 2 : ఆదోని మండలం కుప్పగల్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ వెంకటలక్ష్మీతో కలిసి సబ్ కలెక్టర్ స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుప్పగల్లు సమీపంలో ఉన్న రైల్వే గేట్ వలన ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం పెద్దతుంబళంలోని పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రైల్వే డిప్యూటీ ఇంజనీర్ రమణ రావు, సర్వేయర్ రమణ ఉన్నారు.

ఇద్దరి అరెస్టు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 2: ఆదోని మండలం ఆరేకల్లుకు చెందిన రామాంజనేయులు, వీరేష్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. ప్రయాణికులు ప్రయాణిస్తున్న ఆటోలో వీరు ఆదోని నుంచి అధికమొత్తంలో మద్యంను తరలిస్తుండగా శుక్రవారం గ్రామ శివారులో అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 150 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

కురువలకు ప్రాధాన్యత కల్పించాలి

● బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ కృష్ణమోహన్



మాట్లాడుతున్న శశికళ

ఆలూరు, ఫిబ్రవరి 2: ఆలూరు నియోజకవర్గంలో కురువలను గుర్తించి టీడీపీ అధిష్ఠానం ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని బళ్లారి మాజీ మేయర్ శశికళ కృష్ణమోహన్ కోరారు. శుక్రవారం ఆలూరులోని ఆమె స్వగృహంలో మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో బీసీ ఓటర్లు అధికంగా ఉన్నారని, అందులో 55వేలకు పైగా కురువ ఓటర్లు ఉన్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సర్వే చేయించి టికెట్ కేటాయించాలన్నారు. కర్నూలు జిల్లా కురువలకు ఇంతవరకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు ఇవ్వకుండా ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ పదవులు కేటాయిస్తున్నారన్నారు. కురువలను గుర్తించి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ బసప్ప, మల్లికార్జున, తిమప్ప పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ విధానం అన్యాయం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 2: అప్రెంటిస్ షిప్ విధానాన్ని విద్యా వ్యవస్థలో పునరుద్ధరించడం అన్యాయమని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న అన్నారు. శుక్రవారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రద్దు చేసిన అప్రెంటిస్‌షిప్ విధానాన్ని మళ్లీ ప్రభుత్వం అమలు చేస్తామని ప్రకటించడం మంచిది కాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల నాయకులు రామాంజనేయులు, సుధాకర్ బాబు, రామ్మోహన్ రెడ్డి, షేక్షావలి, బాలాజీ నాయక్, పవన్ కళ్యాణ్, నిరంజన్ రెడ్డి గంగానాయక్ పాల్గొన్నారు.

'దేవాలయ స్థలం కబ్జా కాలేదు..'

మద్దికెర, ఫిబ్రవరి 2 : మండలంలోని ఎరవలి గ్రామంలోని ఎస్సీ కాలనీలోని సుంకులమ్మ దేవాలయం సంబంధించిన స్థలం ఎటువంటి ఆక్రమణకు గురి కాలేదని మాజీ సర్పంచ్ దానమేంద్ర, గ్రామస్థులు ప్రభుదాస్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ నాగభూషణంకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొంత మంది కావాలనే దేవాలయ భూములు అన్యాక్రాంతమైనట్లు ప్రచారం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో టి.లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

రాష్ట్రానికి వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న దేవిశెట్టి ప్రకాష్

ఆదోని టౌన్, ఫిబ్రవరి 2: రాష్ట్ర అభివృద్ధి కోసం వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసింది శూన్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దేవిశెట్టి ప్రకాష్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ నూర్ విమర్శించారు. శుక్రవారం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు కావస్తున్నా రాష్ట్రానికి అవసరమైన ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు సాధించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విభజన హామీల కోసం పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలరెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలో చేస్తున్న ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు మద్దతు ఇస్తున్నా రన్నారు. సమావేశంలో ఎండీ రఫీక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు హనుమంతు, మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు హుస్సేన్ భాష పాల్గొన్నారు.

పత్తికొండ దేవరకు రూ.లక్ష విరాళం



రైతులకు రూ. లక్ష నగదును అందిస్తున్న టీడీపీ నాయకులు

పత్తికొండ, ఫిబ్రవరి 2 : పత్తికొండ దేవర నిర్వహణ, గ్రామదేవతలు బంగారమ్మ, అంకాళమ్మ దేవాలయ ఆర్చీ నిర్మాణాలకు సహకరించాలని ఆయకట్టు రైతులు టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబును కోరారు. స్పందించిన ఆయన రూ.లక్ష ఆర్థికసహాయం ప్రకటించారు. శుక్రవారం కేఈ శ్యాంబాబు తరపున టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి ఆలయ ట్రెజరర్ మల్లికార్జునకు రైతుల సమక్షంలో లక్ష రూపాయాలను అందించారు. ఈకార్యక్రమంలో ప్రమోద్‌కుమార్‌రెడ్డి, చల్లా రవీంద్రనాథ్‌చౌదరి, తిప్పన్న, హరినాథ్‌గౌడ్, ఎరుకలచెరువు సురేంద్ర ఉన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

హొళగుంద, ఫిబ్రవరి 2: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని కోట్ల సుజాతమ్మ అన్నారు. వందవాగిలి గ్రామంలో శుక్రవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ టీడీపీ పార్టీ అని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో ఆలూరు, హొళగుంద, చిప్పగిరి, ఆస్పరి, హాలహర్వి, దేవనకొండ, టీడీపీ మండల కన్వీనర్‌లు తిప్పయ్య, అశోక్, సుధాకర్, పరమారెడ్డి, విజయ్, షేక్షావలి, టీడీపీ సర్పంచులు జీకే సుధాకర్, హనుమంతమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు చిన్నహ్యాట శేషగిరి, హెబ్బెట్టం విష్ణువర్ధన్ రెడ్డి, మైనారిటీ నాయకుడు ఎండీ ఆదాం, కాకి సీతయ్య పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేయకపోతే చర్యలు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 2: రేషన్ సరుకులను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయకపోతే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఆంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని వెంకటాపురం కాలనీ సమీపంలో ఉన్న 6వ వార్డు రేషన్ దుకాణాన్ని ఆయన పరిశీలించారు. గత రెండు నెలలుగా రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయడంలేదని దబ్ధిదారులు ఫిర్యాదు చేయడంతో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. సరుకులను పంపిణీ చేస్తున్న అబ్దుల్ గఫార్ లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తేలడంతో ఆయనపై జిల్లా స్థాయి అధికారులకు నివేదిక పంపిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీలో వీఆర్వో షేక్షావలి పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంపై శిక్షణా తరగతులు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 2: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో గొర్రెల పెంపకంపై శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు పశు విజ్ఞాన శాస్త్రవేత్త నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గొర్రెల పెంపకంపై పది రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. 18-45 ఏళ్ళ లోపు ఉండి 7వ తరగతి పాసైన వారు శిక్షణా తరగతులకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 4ఫొటోలు, రేషన్, ఆధార్ కార్డులతో పాటు బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌ను తీసుకొవచ్చి కృషి విజ్ఞాన కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు వివరాలకు 9346045968కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

కెమికల్ వాడకం వల్ల నష్టం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 2: పట్టణంలోని హోల్ సేల్ పండ్ల వ్యాపారస్తులు వివిధ రకాల పండ్లకు కెమికల్ వాడుతుండడంతో ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, జిల్లా సమితి సభ్యుడు వీరేష్ మండల కార్యదర్శి కల్లుబావి రాజు అన్నారు. శుక్రవారం నాయకులు మాట్లాడుతూ పండ్లను మాగబెట్టడంలో వివిధ రసాయనాలను వినియోగిస్తున్న వ్యాపారులపై దాడులు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి ఫిర్యాదు చేశామన్నారు. వ్యాపారులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు విజయ్, కొత్తూరు ఈరన్న, ఏఐవైయఫ్ అధ్యక్షుడు రమేష్, పుష్పరాజ్, పరశురాం పాల్గొన్నారు.

ఆశాజనకంగా బడ్జెట్

ఆదోని టౌన్, ఫిబ్రవరి 2: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అటు రైతులకు, ఇటు మధ్యతరగతి కుటుంబాల వారికి ఎంతో ఆశాజనకమైన బడ్జెట్‌గా ఉందని బీజేపీ అన్య బాషా రాష్ట్ర కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల వారి అభివృద్ధి కోసం బడ్జెట్లో రూ.50 వేల కోట్లు కేటాయించడం అభినందనీయమని అన్నారు. ఎన్నికల అనంతరం వచ్చే పూర్తి స్థాయి బడ్జెట్లో మరెన్నో రాయితీలు ప్రకటించే అవకాశం ఉందన్నారు.

సమస్యలపై పోరాడేందుకు ముందుంటాం



సీపీఎం నాయకలకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, ఫిబ్రవరి 2: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు ముందుంటామని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఉప్పర్లపల్లిలో గ్రామ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు, రంగరాజు ఆధ్వర్యంలో ఒక్కరోజు రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. టీడీపీ నాయకులు ఉప్పర్లపల్లికి వెళ్లి రిలే నిరాహారదీక్షలు చేస్తున్న సీపీఎం నాయకులకు మద్దతు ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని, దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్య ప్రకాష్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు గౌడు, రంగారెడ్డి, శివ, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పని దినాలు కల్పించాలి

● డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 2: ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం కింద వంద రోజులు పని దినాలు కల్పించాలని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పత్తికొండ క్లస్టర్ సమావేశ భవనంలో క్లస్టర్ ఈపీవోలు, టీసీలు, టీఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వంద రోజులు పని దినాలు కల్పించేందుకు అందుకు తగ్గట్లు పనులు కూడా గుర్తించాలన్నారు. జాబ్ కార్డులు లేని వారికి కొత్త జాబ్ కార్డులను అందించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్కరికి పనులు కల్పించడమే కాకుండా వేతనాలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఈపీడీ ఫక్కీరప్ప, కోర్సు డైరెక్టర్ ప్రదీప్‌నాయక్, పత్తికొండ ఏపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించండి



సీఐ ఎరిషావలిని సన్మానిస్తున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

మంత్రాలయం, ఫిబ్రవరి 2: మండలంలో దళితులు ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి దళితులకు న్యాయం చేయాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కిం జానయ్య, జిల్లా కార్యదర్శి గర్జి హనుమన్నలు అన్నారు. శుక్రవారం మండలంలోని మంత్రాలయం సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎరిషావలిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో దళిత గిరిజనులపై దాడులు, అత్యాచారాలు, కులవివక్ష అధికంగా ఉందని, ఇటువంటి వాటిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి యోహాన్, జిల్లా అధ్యక్షుడు ముత్తు సుమాల, లాజర్, గర్జి ప్రకాష్ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం



మలబద్ధి నరసింహులు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రదీప్ రెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 2: టీడీపీ కార్యకర్త నరసింహులు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని సింగిల్ విండో అధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో చనిపోయిన కార్యకర్త కుటుంబాన్ని నాయకులు వేర్వేరు సమయాల్లో నివాళులర్పించి కుటుంబానికి భరోసా ఇచ్చి వారిని ఓదార్చారు. ప్రదీప్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.25వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జంగం వీరన్నస్వామి, అల్లె వీరభద్రప్ప, సతీష్, గోబి నరసింహ, ఇడుపునూరు ముక్కన్న, శ్రీనివాసులు, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నరహరి తీర్థ ఆరాధనోత్సవాలు

మంత్రాలయం, ఫిబ్రవరి 2: మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురువులైన మధ్వాచార్యులైన ద్వితీయ శిష్యులు నరహరి తీర్థ మధ్యారాధన మహోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం కర్ణాటకలోని హంపీ, రఘునందన తీర్థుల సన్నిధానంలో నరహరితీర్థుల ఆరాధన మహోత్సవాలు శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో ఘనంగా నిర్వహించారు. అనంతరం పండితులచే నరహరితీర్థుల జీవితఘట్టాలను, ప్రవచనాలు వినిపించారు.

జిల్లా స్థాయి ఖోఖో విజేత వందగల్లు



జిల్లా స్థాయిఖో-ఖో పోటీల్లో మొదటి బహుమతితో వందగల్లు క్రీడాకారులు

కోసిగి, ఫిబ్రవరి 2: జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం ముందు నిర్వహించిన జిల్లా స్థాయి ఖో-ఖో పోటీల్లో మొదటి విజేతగా కోసిగి మండలం వందగల్లు గ్రామానికి చెందిన జట్టు విజేతగా నిలిచింది. ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా గురువారం సాయంత్రం జరిగిన జిల్లా స్థాయి ఫైనల్‌లో తుగ్గలి, వందగల్లు జట్ల మధ్య హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో వందగల్లు జట్టు మొదటి విజేతగా నిలవడంతో పాటు వారికి కప్ షీల్డ్ అందజేశారు. రూ.60వేల నగదును 5న కలెక్టర్ చేతుల మీదుగా తీసుకుంటున్నట్లు కోచ్ ధర్మరాజు తెలిపారు. జిల్లా స్థాయిలో గెలిచిన వందగల్లు జట్టు ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

మొలగవల్లి వైద్యురాలిపై చర్యలు

ఆలూరు, ఫిబ్రవరి 2: ఆలూరు మండలం మొలగవల్లి పీహెచ్‌సీ వైద్యురాలు శాంతిను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్‌కు సరెండర్ చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రామగిడ్డయ్య ఉత్తర్వులు జారీ చేశారు. విధులకు సక్రమంగా హాజరు కాకపోయినా, ప్రతినెల మాత్రం జీతం తీసుకుంటుందని గ్రామస్థులు, సీపీఐ, ప్రజాసంఘాలు ఫిర్యాదు మేరకు గత నెల 23న ఆదోని డిప్యూటీ డీఎం&హెచ్‌వో సత్యవతి విచారణ జరిపారు. ఈ మేరకు డా. శాంతిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇన్‌చార్జి వైద్యులుగా ములుగుందం పీహెచ్‌సీ వైద్యులు రఘురామి రెడ్డికి బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అగ్ని ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

ఆస్పరి, ఫిబ్రవరి 2: మండలంలోని హలిగెర గ్రామంలో ఇటీవల కిరాణ షాపులో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబాన్ని ఆలూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విరుపాక్షి సోదరుడు వెంకటేష్ శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. షాపు యజమాని హరిజన ఈరన్నకు రూ.10 వేల నగదును అందజేశారు. నాయకులు బిణిగేరి సర్పంచ్ వెంకటేష్, తలారి వెంకటేష్, ప్రకాష్, మాజీ సర్పంచ్ యువరాజు, ప్రస్తుత ఉప సర్పంచ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

కోసిగి, ఫిబ్రవరి 2: కోసిగి మండల పరిధిలోని ఐరంగల్ గ్రామ సమీపంలో ఉన్న రైల్వేగేటు స్థల ప్రాంతంలో ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం కొరకు శుక్రవారం రైల్వే అధికారులతో కలిసి ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ స్థలాన్ని సేకరణ చేసి ప్రాంతాన్ని పరిశీలించారు. రైల్వే డిప్యూటీ ఇంజనీర్ రమణారావు మాట్లాడుతూ సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఐరంగల్ రైల్వే గేటు దగ్గర ఐవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. వీరి వెంట కోసిగి తహసీల్దార్ రుద్రగౌడు; మండల సర్వేయర్ బసవరావు, ఆర్ఐ శ్రీరామ్, తిక్కస్వామి, వీఆర్వో బసవరాజు, రైల్వే అధికారులు ఉన్నారు.

మా కులాన్ని తేల్చి కులగణన చేయండి



ఆర్డీవోతో మాట్లాడుతున్న మాదాసి మాదారి కురువ సంఘం నాయకులు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 2: ఏ జాబితాలో తమ కులం ఉందో తేల్చి ఆ తర్వాత ప్రభుత్వం కులగణన చేయాలని మాదాసి, మాదారి కురువ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సోమలింగ, బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో రామలక్ష్మిని మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు తమ ఇంటి దగ్గరకు వచ్చి కుల గణన విషయంలో ఇబ్బందిపెడుతున్నారని అన్నారు. గతంలో తాము ఆందోళన చేసినప్పుడు మాదాసి కురువ కులం ఎస్సీ జాబితాలో ఉందని చెప్పామని, ఆ తర్వాత ఎటూ తేల్చకుండా సర్వేల పేరుతో వలంటీర్లు కురువల కింద తమ కులం పేరు చేర్చుతున్నారని ఆర్డీవోకు వివరించారు. ఆర్డీవో మాట్లాడుతూ కులగణనలో ఎవరిపైనా ఒత్తిడి తీసుకురావద్దని, సంబంధిత వలంటీర్లుకు కూడా ఆదేశాలు జారీ చేశామని, ఇష్టపూర్వకంగా వారి కులాన్ని కులగణనలో నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చామని సూచించారు. సమస్య పరిష్కారానికి పై స్థాయి అధికారుల దగ్గరకు వెళ్లాలని అన్నారు.

యువతను మోసం చేసేందుకే డీఎస్సీ ప్రకటన



మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 2: ఎన్నికలు సమీపిస్తుండటంతో యువతను, నిరుద్యోగులను మోసం చేసేందుకు గాను జగన్ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని మండల తెలుగుయువత అధ్యక్షుడు రంగస్వామినాయుడు, ఉపాధ్యక్షుడు ఐరన్‌బండ ముల్లా బాషా, పిల్లిగుండ్ల జయపాల్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు 60 రోజులు ఉండగా ఇదిగో డీఎస్సీ అని ఉద్యోగ ప్రకటన చేయడం జగన్ మభ్యపెట్టడం కాదా అని వారు ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లలో ఒక్కసారికూడా ఉద్యోగ నియమకాలను చేపట్టలేదన్నారు. 6100 ఉపాధ్యాయ ఉద్యోగాలను విడుదల చేయడం మోసం కాదా అని వారు ప్రశ్నించారు. వచ్చే ఎన్నికలలో వైసీపీని ఇంటి పంపాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రామాంజినేయులు, ప్రసంగి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 2 : ఐసీడీఎస్ ప్రాజెక్టు (వెల్దుర్తి) పరిధిలో వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల్లో అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో లూక్ శుక్రవారం తెలిపారు. మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్త 1 (కటారుకొండ ఓసీ), ఆయా పోస్టులు 4 (లక్ష్మసాగరం-ఓసీ, సంగాల బీసీ-ఏ, సూదేపల్లి-ఎస్సీ, మల్లేపల్లి-ఓసీ) ఖాళీగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు 10వ తరగతి పాసై ఉండాలని, ఆయా పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలన్నారు. 1.7.2023 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. పెళ్లయి అదే గ్రామంలో నివసిస్తూ ఉండాలని అన్నారు. దరఖాస్తులను సీడీపీవో కార్యాలయంలో 7న సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలన్నారు.

5న తలనీలాలు, టెంకాయ వేలంపాట

దేవనకొండ, ఫిబ్రవరి2 : కప్పట్రాళ్ల రిజార్వు పరిధిలోని కౌలుట్ల చెన్నకేశవ స్వామి దేవస్థానంలో తలనీలాలు, టెంకాయ వేలంపాటలు 5న నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ హనుమంతరెడ్డి తెలిపారు. వేలం పాటలో పాల్గొన్నే వారు తలనీలాలకు రూ.50 వేలు, టెంకాయ వేలాలకు రూ.10 వేల ధరావత్తు చెల్లించాల న్నారు.

ఓపీఎస్ పోస్టర్ల విడుదల

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 2: క్రిష్ణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు కల్పన శుక్రవారం ఓపీఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ భద్రత లేదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షులు నారాయణ రెడ్డి, యూటీఎఫ్ సీనియర్ నాయకులు శివప్రసాద్‌రెడ్డి, కెంగార మోహన్, జిల్లా కౌన్సిలర్లు రాములు, సహాధ్యక్షురాలు హసీనా, ఆర్థిక కార్యదర్శి సురేష్‌లు పాల్గొన్నారు.

గుమ్మల ఆంజనేయుల సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పి. రామచంద్రయ్య

మద్దికెర, ఫిబ్రవరి 2 : పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసిన గుమ్మల ఆంజనేయుల సేవలు మరువలేనివని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పి. రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో గుమ్మల ఆంజనేయ 33వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఆయన స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నబీరసూల్, మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, పెరవళి శాఖ కార్యదర్శి సుధాకర్‌రె, మండల మాజీ కార్యదర్శి పాపన్న, గుంత హనుమన్న, నెట్టికంటయ్య, కోదండరాముడు, కారన్న, తదితరులు ఉన్నారు.

నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

ఆదోని టౌన్, ఫిబ్రవరి 2: ఎలాంటి రాయితీలు ప్రకటించకుండా, కేవలం ఎన్నికల తాయిలాలతో కూడిన బడ్జెట్ సామాన్యులకు, మధ్యతరగతి వారికి పూర్తిగా నిరాశపరిచే విధంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఆదోని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీ కన్వీనర్ ఆదినారాయణ అన్నారు. శుక్రవారం ఆయన బడ్జెట్ గురించి మాట్లాడుతూ ఎన్నికల అనంతరం మళ్లీ తాము అధికారంలోకి వచ్చి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని, ఆర్థికశాఖ మంత్రి అనడం చూస్తుంటే, ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్ తాత్కాలికమేనని, వాతలతో కూడిన బడ్జెట్ ఎన్నికల అనంతరం రాబోతోందని పరోక్షంగా సంకేతాలు ఇస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజల్ ధరలను తగ్గిస్తారని, పలితంగా నిత్యావసరాల ధరలు కాస్తయినా అందుబాటులోకి వస్తాయని ఎదురు చూసిన మధ్య తరగతి వారి ఆశలను వమ్ము చేసే బడ్జెట్ అందరినీ నిరాశ పరిచేలా ఉందన్నారు. వేతన జీవులకు ఆదాయ పన్నులో ఎలాంటి రాయితీలు ప్రకటించలేదని అన్నారు.

డిజిటల్ బోధనతో విద్యార్థుల్లో నూతనోత్సాహం

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 2: ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ బోధన విద్యార్థులకు చదువు పట్ల నూతన ఉత్సాహాన్ని ఇస్తుందని ఎంఈవో-2 మధుసూదన్‌రాజు, హెచ్ఎం చిత్రలేఖలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీటీ సిమ్యూలేషన్‌పై మూడు రోజుల పాటు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మొదటి రోజు గణిత ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ వెంకటేశ్వర్లు, మల్లికార్జున, శేఖరప్ప తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ, రైతు సంఘం నాయకులపై కేసు నమోదు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 2: ఎమ్మిగనూరు మండల పరిధిలోని కలుగొట్ల గ్రామ సమీపంలో రైతుల మోటారులకు విద్యుత్ శాఖ అధికారులు బిగించిన విద్యుత్ మీటర్లను ధ్వంసం చేసిన సీపీఐ, రైతు సంఘం నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాలనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ గురుమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు. దాడికి పాల్పడిన వారిలో పంపన్నగౌడు, రసూల్, రంగన్న, మల్లికార్జునగౌడు, భాస్కర్‌యాదవ్‌లతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రైతు సంఘం నాయకులపై కేసు నమోదు చేయడం దారుణం

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 2: రైతుల పొలాల్లో బోరు మోటారులకు విద్యుత్ మీటర్లను తొలగించిన రైతు సంఘం నాయకులు, సీపీఐ నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం కేసులు పెట్టడం దారుణమని టీడీపీ కర్నూలు పార్లమెంట్ కురువ సాధికార సంఘం సభ్యులు కె.టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వకుండా, వ్యవసాయ బోరు మోటారులకు విద్యుత్ మీటర్లు బిగించి వైసీపీ ప్రభుత్వం ఎనలేని భారాన్ని మోపిందన్నారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తే నేడు ఆయన తనయుడు సీఎం జగన్ ఉచిత విద్యుత్ పథకానికి తూట్లు పొడిచి రైతులకు అన్యాయం చేస్తున్నాడని మండిపడ్డారు. రైతులకు గుదిబండగా మారిన విద్యుత్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.